ప్రజలు, రైతుల పాలిట ఉరితాళ్ళు...స్మార్ట్ విద్యుత్ మీటర్లు

సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర - నరసన్నపేట : సీపీఐ పార్టీ నిర్వహించిన అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశంలో పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు మాట్లాడుతూ స్మార్ట్ విద్యుత్ మీటర్ల పేరుతో ప్రజల గొంతు కోసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుతున్న కుట్రను తీవ్రంగా వారు దుయ్యబట్టారు. బుధవారం స్థానిక సౌభాగ్యలక్ష్మీ కళ్యాణమండపంలో నరసన్నపేట సిపిఐ మండల అధ్యక్షులు, నెయ్యిల నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా సీపీఐ కార్యవర్గ నాయకులు, సనపల నర్సింహులు మాట్లాడుతూ విభజన హామీ చట్టంలో ఆంధ్ర రాష్ట్రానికి ఇచ్చిన హామీలను నెరవేర్చని బిజేపి ప్రభుత్వం, నేడు స్మార్ట్ విద్యుత్ మీటర్లును ఆంధ్ర రాష్ట్రంలో పెడితే అన్ని వర్గాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. వామపక్షాల పార్టీలతో, అన్ని రాజకీయ పార్టీలతో వైసిపికి వ్యతిరేకంగా ఈనెల 30వ తేదీన విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసన, ధర్నా నిర్వహించి, స్మార్ట్ మీటర్లు కాంట్రాక్ట్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పంచభూతాలపై పన్ను వేసేస్థితిలో జగన్ ప్రభుత్వం

రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం పంచాభూతాలపై పన్ను వేసే విధంగా వుందని, రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు అన్ని రాజకీయ పార్టీలు కంకణం కట్టుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు బందిపోటు దొంగల వలే వ్యవహరిస్తున్నాయని అన్నారు. కరెంటు ఛార్జీలు పెంచమని చెప్పిన సిఎం, జగన్మోహన్‌రెడ్డి నేడు ప్రజలకు నమ్మకద్రోహం చేశారని, మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు జగన్ పూర్తిగా లొంగిపోయారని, సర్దుబాటు ఛార్జీల భారాలను రద్దు చేయాలని, ఈనెల 30వ తేదీన విద్యుత్ సబ్ స్టేషన్లను ముట్టడిస్తామని టిడిపి తరపున పూర్తి మద్దతు తెలుపుతున్నామని అన్నారు.

గొద్దు చిట్టిబాబు, టీడీపీ అధికార ప్రతినిధి

బటన్ నొక్కుతానని ప్రజల పీకలు నొక్కుతున్న జగన్

సంక్షేమ పథకాల పేరుతో బటన్ నొక్కుతున్న సిఎం, జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల పీకలు నొక్కుతున్నారని, రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగిస్తున్న వైసిపికి రానున్న 2024లో మరలా అవకాశమిస్తే రాష్ట్రం మరో ఉత్తర కొరియా అవుతుంది. వైసిపి ఎమ్మెల్యేకు గుర్తింపు లేకుండా రాష్ట్రంలో నియంత పాలన కొనసాగుతోంది. పాలకుల అవినీతి ఫలితమే విద్యుత్ ఛార్జీల పెంపుఅని, స్మార్ట్ మీటర్ల కొనుగోళ్ళలో వేల కోట్లు అవినీతి జరుగుతోందని, అవినీతి కుంభకోణంలో బిజేపి, వైసిపి ప్రభుత్వం రెండు కుమ్మక్కు అయ్యాయని, అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో వైసిపికి వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా వుంటుంది.

మధుసూధనరావు,కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ

విద్యుత్ ఛార్జీలకు వ్యతిరేకంగా పోరాడదాం

దేశంలో ప్రైవేటీకరణ విధానాలు విద్యుత్ రంగంలో ప్రారంభమయిన తర్వాత విద్యుత్ ప్రభుత్వ సంస్థలు, ప్రైవైట్ విద్యుత్ సంస్థలతో అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. అదానీ కుంభకోణం ఇటీవల ఇలాంటి తప్పుడు లెక్కలను చూపించిన విషయం అందరికీ తెలిసిందే. విద్యుత్ సంస్కరణల పేరుతో తీసుకొస్తున్న విధానాలను ప్రజలందరూ ఖండించాల్సిన అవసరం ఆసన్నమయ్యింది. కార్మిక వర్గానికి చెందిన సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన విద్యుత్ సబ్ స్టేసన్ల వద్ద నిరసన కార్యక్రమానికి సిద్ధంమన్నారు. 2000వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలు తెలిపిన నిరసనకు తలొగ్గి, ప్రజాగ్రహానికి ఎలా వెనక్కి తగ్గిందో నేడు కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేద్దామని తెలిపారు.

ఆర్.సురేష్‌బాబు, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు

విజేతులుగా గెలిపొందిన వారికి బహుమతులు

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : మండలం రోటరీ నగర్ నందు ఆర్బిఐ మండల్ లెవెల్ క్విజ్ కాంపిటేషన్ మండల విద్యా శాఖాధికారి అధ్వర్యంలో మండలంలో ఐదు జిల్లా పరిషత్ పాఠశాల నుండి పది మంది బాల బాలికలకు క్విజ్ పోటీలు బుధవారం నిర్వ హించారు. ఈ కార్యక్రమంలో విజేతలకు మండల విద్యా శాఖా ధికారి ఎన్.శ్రీనివాసరావు చేతుల మీదుగా సర్టి ఫికెట్‌లను అందజేశారు. మొదటి విజేత జడ్పీహెచ్ఎస్ స్కూల్ కొమ్మువలస వై.ప్రశాంతి, ఈ.కార్తీక్‌లకు 5 వేల రూపాయిలు రెండవ విజేత జడ్పీహెచ్ఎస్ ఎల్ఎన్‌పేట కె.రాహూల్ బి.పవిత్ర లకు 4వేల రూపాయిలు 3వ విజేత జడ్పీహెచ్ఎస్ పూశాం డి.భాస్కరరావు, టి.శ్రీనులకు 3 వేల రూపాయిలు విజేతలుగా నిలిచారు. వారి బ్యాంకు అకౌంట్‌లో జమ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్విజిలేటర్లుగా పైడిరాజు, ఎల్ఎన్‌పేట ఆంధ్రబ్యాంకు మేనేజర్, మండల స్థాయిలో విజేతగా నిలిచిన విద్యార్థులు 28-06-20023 తేదిన ఆర్బిఐ జిల్లా లెవెల్ కాంపిటేషన్‌కు హాజరుకావాలని తెలిపారు.

లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌ను సందర్శించిన గవర్నర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : లైన్స్ క్లబ్ సెంట్రల్‌ను 316 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ ఏ గోపాలరావు, పూర్వ గవర్నర్ డి రాఘవేంద్రరావు, పూర్వ గవర్నర్, పూర్వ మల్టిపుల్ కౌన్సిల్ చైర్పర్సన్, వైస్ ఏరియా లీడర్ గ్లోబల్ యాక్షన్ టీం డి ఎస్ ఎస్ వర్మలు మంగళవారం సాయంత్రం సందర్శించారు. నర్సీపట్నంలో వచ్చే నెలలో జరగనున్న గవర్నర్ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి శ్రీకాకుళం టీమును ఈ సందర్భంగా వారు ఆహ్వా నించారు. అనంతరం క్లబ్ అభివృద్ధిపై లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో రీజన్ చైర్పర్సన్ నటుకుల మోహన్, పూర్వ అధ్యక్షులు డాక్టర్ బాడాన దేవభూషన్ రావు, 2023-24వ సంవత్సరం గాను ఎన్నుకోబడిన నూతన అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, కార్యదర్శి టి రాంగోపాల్, కోశాధికారి శిల్లా మనీ, సభ్యులు నటుకుల రేణుక, కిల్లి అప్పారావు మాస్టారు, జే భారతి, ఎం హారతి, సీపాన రమేష్ కుమార్, రామ్మోహన్, నటుకుల ఉషా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జీల్ సేవలు అభినందనీయం : కలెక్టర్ శ్రీకేష్ లాఠకార్

విశాలాంధ్ర - శ్రీకాకుళం టౌన్ : నగరంలో జీల్ ఫౌండేషన్ సేవలు రోజురోజుకి విస్తరిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యంపట్ల దృష్టి సారించిన ప్రతినిధులు తన దైన శైలిలో సేవలం దిస్తున్నారు. నిరుపేదలకు ఆ సంస్థ ప్రతినిధి సాయి అందిస్తున్న సేవలకు గాను అధికారులు, ప్రజా ప్రతినిధుల నుంచి మన్ననలు పొందు తున్నారు. అంతర్జాతీయ యోగాడే నేపథ్యంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకార్ నుంచి మోమెంటోను, ప్రశంసలు అందుకున్నారు. యోగా పట్ల యువత ఆసక్తి చూపేలా చైతన్యం తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సాయి చేస్తున్న సేవలు పట్ల ఆయుష్ విభాగం నుంచి అభినందనలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జీల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సత్య సాయి, డాక్టర్ ప్రియాంక, శివ ప్రసాద్, పొడుగు చరణ్, జేసీఐ గ్రీన్ సిటీ మణి శర్మ ఉన్నారు.

కంచిలి మండల సీపీఐ కార్యదర్శి జాజిమొగ్గల తరణి మృతి

విశాలాంధ్ర - కంచిలి : శ్రీకాకు ళం జిల్లా కంచిలి మండల సీపీఐ మండల కార్య దర్శి జాజి మొగ్గల తరణి (55) బుధ వారం ఉద యం మృతి చెందారు. వడదెబ్బతో అనారోగ్యం చెంది గత నాలుగు రోజుల కిందట శ్రీకాకుళం జేమ్స్ హాస్పిటల్ లో జాయిన్ అయి, బుధవారం ఉదయం 10 గంటలకు మరణించారు. ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామమైన పూర్ణ శాసనం గ్రామంలో, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈయన 1980 నుంచి సీపీఐ లో క్రియాశీలంగా వ్యవహరించి పలు ప్రజా సమస్యల మీద పోరాటాలు చేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. తరణి సంతాప సభలో, జిల్లా పార్టీ పూర్వ కార్యదర్శి చాపర వెంకట రమణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తాడిత, పీడిత ప్రజల కోసం, గిరిజన, హరిజన, బలహీన వర్గాల ప్రజల కోసం, అనేక పోరాటాలు నిర్వహించి, వందలాది ఎకరాలు భూమిని ప్రజలకు పంపకం చేయడం జరిగిందని, ఆయన అకాల మరణంతో ఈ ప్రాంతానికి, జిల్లా పార్టీకి, ఆయన లేని లోటు తీరనిది అన్నారు. ఆయనకి ఘ నంగా నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు శ్రీకాకుళం జిల్లా సమితి తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆశయాలను కొన సాగించడమే ఆయనకు నిజమైన నివాళు లని, ఆయన స్పూర్తితో కమ్యూనిస్టు పార్టీ మరిన్ని పోరాటాలు కొనసాగించడం ద్వారా ఆయన గణమైన నివాళులర్పించి నట్టని పార్టీకి కార్యకర్తలకి, ప్రజల్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఐ సీనియర్ నాయకులు చాపర సుందర్ లాల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లండ వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం యుగంధర్, సోంపేట మం డల కార్యదర్శి ఎస్ కేశవ్, నియోజవర్గ కార్యకర్తలు, ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తరణి మృతి సీపీఐ పార్టీకి తీరని లోటు

సీపీఐ జిల్లా కార్యదర్శి, బలగ శ్రీరామ్మూర్తి

విశాలాంధ్ర - గార : సీపీఐ కంచిలి మండల కార్యదర్శి జాజిమొగ్గల తరణి మృతి పార్టీకి తీరని లోటని, జిల్లా సీపీఐ కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి తన ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంగా ఒక ప్రకటనను విడుదల చేసారు. పార్టీ కోసం అహర్నిశలు పనిచేసిన పోరాట యోధుడు తరణి అని, ఆయా ప్రాంతాల్లో ఉన్న బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అహర్నిశలు పరితపించేవారిని వెల్లడించారు. తరణి లేని లోటు కుటుంబంతో పాటు పార్టీకి కూడా ప్రస్ఫుటంగా కనిపిస్తుందని ఆవేదన చెందారు. ఎన్నో పోరాటాల ద్వారా సాధించిన వందలాది ఎకరాల సాగుభూమిని, అన్ని వర్గాల ప్రజానీకానికి సమానంగా పంపిణీ చేసిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు సీపీఐ జిల్లా పార్టీ శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని జిల్లా కార్యదర్శి ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులలో ఆర్థిక అవగాహనపై క్విజ్ పోటీలు

విశాలాంధ్ర - కవిటి : విద్యార్థులలో ఆర్థిక అవగాహన ఎంతవరకు ఉంది అన్న భావనతో 8, 9, 10 తరగతిలో చదివే విద్యార్థులకు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సౌజన్యంతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం కవిటి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఎల్ మిశ్రా క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉదయ్, శ్రీకర్ మొదటి స్థానం పొందారు. రాజపురం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు రోహిత్, దిలీప్ రెండవ స్థానం పొందారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు త్రిలోచన, పవిత్ర లు మూడో స్థానంలో నిలిచారు. వీరికి మొదటి బహుమతి 5 వేల రూపాయలు, రెండో బహుమతి 4 వేల రూపాయలు, మూడో బహుమతి 3 వేల రూపాయలు విద్యార్థుల ఖాతాలో జమ చేస్తామని తెలియజేశారు. విజేతలకు మండల విద్యాశాఖ అధికారి ధనుంజయ మజ్జి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధనుంజయ మజ్జి మాట్లాడుతూ మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన బొరివంక ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయికి పంపించబడతారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర రావు,పీసీ చైర్మన్ మొగలిపురి కృష్ణారావు, ఉపాధ్యాయ సిబ్బంది సిబ్బంది మల్లేశ్వరరావు,శిరీష, నాగరాజు జ్యోతి కుమారి, అరుణ, సి.అర్.పి తనూజ తదితరులు పాల్గొన్నారు.

పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - మందస : పాడి రైతులు పశు బీమాను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ వి.జయరాజు అన్నారు. బుధవారం బుడారిసింగి సచివాలయంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు సురేష్‌కుమార్ పాణిగ్రాహి అధ్యక్షతన మెగా పశుబీమా శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వై.ఎస్.ఆర్ పశుబీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఒక్కో సంకరజాతి పాడి పశువుల కోసం 400 రూపాయలు ప్రీమియం చెల్లిస్తే మూడేళ్ల పాటు దానికి బీమా వర్తిస్తుందని, ఆ పశువు మృతి చెందితే 30వేల రూపాయలు పరిహారం స్తుందన్నారు. దేశవాలి ఆవుకు 200 రూపాయలు చెల్లిస్తే 15వేల బీమా వర్తిస్తుందని, ఒక కుటుంబం గరిష్టంగా ఐదు పాడి పశువుల వరకు బీమా చేయించుకోవచ్చని అన్నారు. మండలంలో 335 పశువులకు బీమా చేయాలన్నది లక్ష్యం గాక ఇప్పటి వరకు 136 పాడి రైతులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో పలాస ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పి.చంద్రశేఖర్, మందస, హరిపురం పశువైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమాభారతి, ఎంపీటీసీ లోకనాధంలు పాల్గొన్నారు.

విజయవంతమైన ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - పలాస : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పలాస జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ఆధ్వర్యంలో కార్యాలయం ఆవరణలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. షిలా కంటి ఆసుపత్రి సౌజన్యంలో నిర్వహించిన శిబిరంలో ఎల్ఐసి చీఫ్ మేనేజర్ టి.బిసాయి మాట్లాడుతూ తమ పాలసీ దారులకు పొదుపుతో పాటు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఎల్ఐసి వద్ద అన్ని పథకాలు ఉన్నాయని, సమాజ పురోగతిలో ఎల్ఐసి తనవంతు పాత్ర పోషిస్తుందని అన్నారు. అనంతరం వైద్య శిబిరంలో రోగులకు డాక్టర్ షిలా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన రోగులకు ఉచిత మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్.మురళీ, రాజు, అసిస్టెంట్ మేనేజర్ వి.శ్రీకాంత్‌లతో పాటు సంస్థ ఉద్యోగులు, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు.

వర్సిటీలో మెరుగైన సౌకర్యాలతో విద్యాబోధన

వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో మెరుగైన సౌకర్యాలతో విద్యాబోధన సాగిస్తున్నట్లు విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకట్రావు తెలిపారు. వర్సిటీలోనే హాస్టల్ ను ఆయన బుధవారం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందిస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులు వసతు, వనరులను సక్రమంగా వినియోగించుకొని లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ మేనేజర్ రాఘవరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ఆణిముత్యాలు స్ఫూర్తిదాయకం



విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : విద్యలో రాణించిన విద్యార్థులను మరింత ప్రోత్సాహించేలా ప్రభుత్వం ఆణిముత్యాలు కార్యక్రమాన్ని రూపొందించిందని సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. సింహాచలం అన్నారు. పాఠశాలలో ప్రతిభ కనబర్చి మొదటి మూడు స్థానాలు పొందిన నీతు, గ్రీష్మ, కన్నా బెహరాలకు నగదు పారితోషకంతో పాటు మెడల్స్, ప్రశంశా పత్రాలు అందజేసారు. ఆణిముత్యాలు స్ఫూర్తిదాయకంగా ఉండాలని, ఇతర విద్యార్థులు వారిని అనుకరించి, పాఠశాల కీర్తిని ఇనుమడింపజేసేలా మరిన్ని మెరుగైన ఫలితాలు దక్కించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివరామప్రసాద్, కామరాజు, సూర్యం, జయలక్ష్మి, పద్మాబాయి తదితరులు పాల్గొన్నారు.

బోరు బావికి శంకుస్థాపన

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : మండలంలో టి బరంపురం అమ్మవారి ఆలయ ప్రాంగ ణంలో బోరు బావి ఏర్పాటుకు సర్పంచ్ కారంగి త్రినాథ్ 15వ ఆర్థిక సంఘం నుండి నిధులు కేటాయింపు జరపడంతో బుధవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తుల సౌకర్యం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సర్పంచ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ తివ్వన ధనంజయ, దక్కత నరసింహులు, దక్కత వాసులు, ధూపాన నారాయణ, దక్కత మోహన్ రావు, కొయ్య జగన్నాథ, నగిరెడ్ల మాదయ్య, ఎదురు కేదారి, ఎదురు నారాయణ, నగిరెడ్ల కాళిదాస్, లింగయ్య, జగన్ పాల్గొన్నారు.

గురజాడ విద్యాసంస్థల్లో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : గురజాడ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవ సామూహిక యోగ సాధన కార్యక్రమం 14వ ఆంధ్ర బెటాలియన్ ఎన్ సి సి శ్రీకాకుళం ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 14వ ఆంధ్ర బెటా లియన్ కమాండింగ్ అధికారి కల్న ల్ అమిత్ బెనర్జీ పాల్గొని యోగ సాధకులను ఉత్సాహ పరిచారు. ఈ సందర్భంగా అమిత్ బెనర్జీ మాట్లాడుతూ 2023 సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్య నేపథ్యంగా భారత ప్రభుత్వం వసుదైవక కుటుంబకంని తీసుకోవడం జరిగిందన్నారు. యోగా ద్వారా మనుషుల్లో ఉన్న తారతమ్యాలను తొలగించి మనుషుల్లో సానుకూల దృక్పథం ఏర్పరిచే ప్రయత్నమే ఈ సంవత్సర యోగదిన ఉద్దేశం అని అన్నారు. వివిధ కళాశాల నుంచి, పాఠశాల నుంచి 353 ఎన్సిసి క్యాడెట్లు పాల్గొన్నారు. అనంతరం యోగ గురువులు వై. రామారావుకి, సుజాతకి సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జీవి. స్వామి నాయుడు, డైరెక్టర్స్ సంచాలకులు జి. సంయుక్త కరస్పాండెంట్ అంబటి రంగారావు, గాయత్రీ కళాశాలల ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, స్కూల్ ప్రిన్సిపాల్ ఏకె. విజయలక్ష్మి, కళాశాల ఎన్సిసి అధికారి కెప్టెన్ వంగ మహేష్, కెప్టెన్ పోలినాయుడు, సుబెదార్ మేజర్ సుభాష్ చంద్, కేశవ నాయుడు పొడుగు చరణ్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం క్యాంప్ కార్యాలయంలో సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



విశాలాంధ్ర - పాతపట్నం : శాసనసభ్యులు రెడ్డి శాంతి తాడేపల్లి లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాల యం లో జగనన్న సురక్ష, గడప గడపకూ మన ప్రభుత్వం కార్య క్రమాలపై నిర్వహించిన సమీక్ష సమా వేశంలో పాల్గొని పాతపట్నంలో జరుగుతున్న గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమీక్షలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రాంతీయ సమన్వయకర్తలు, ఇతర ప్రజా ప్రతినిధులతో పాటు రెడ్డి శాంతి పాల్గొన్నారు.

కేన్సర్ బాధితునికి రూ.10 వేల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - పొందూరు : మండలం అచ్చిపోలవలస గ్రామానికి చెందిన కేన్సర్ బాధితుడు, ఎస్.జి.టి మర్రి పోలినాయుదుకు శుక్రవారం ఇదే గ్రామానికి చెందిన ప్రముఖ రచయిత, స్కూల్ అసిస్టెంట్ బొడ్డేపల్లి భూపతిరావు రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందించారు. దీర్ఘకాలికంగా సెలవులో ఉన్నందున ఎస్.జి.టి పోలినాయుదుకు జీతం అందడం లేదు.నాలుగేళ్ళ కితం ఆయనకు పెళ్లయింది. పాప కూడా ఉంది. ఆర్థికంగా సతమతమవుతున్నాడు.ఇప్పటికే వైద్యం కోసం రూ 15లక్షల మేరకు ఖర్చు చేశాడు.ప్రస్తుతం పైసా కూడా లేకుండా సతమతమవుతున్నాడు.ఆపన్న హస్తాల కోసం ఈ కుటుంబం ఎదురు చూస్తోంది. బాధితునికి సాయం అందించ దలచిన వారు అతని సెల్ 96183 82901కు ఫోన్ పే చేయవచ్చు. దాతలు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు, స్పందించాలి.సి.ఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందించడం మరింత అవసరం.

స్టాంప్ డ్యూటీ డబ్బులు సర్పంచ్‌ల ఖాతాల్లో జమ చేయాలి

సబ్ రిజిస్టర్‌కి వినతి పత్రం అందజేసిన సర్పంచులు

విశాలాంధ్ర - రణస్థలం : పంచా యతీలకు రావలసిన సంవత్సరం ఆరునెలల స్టాంప్ డ్యూటీల డబ్బులను సీనరీస్ డబ్బులను సర్పంచ్ ఖాతాలలో జమ చేయాలని సబ్ రిజిస్టర్‌కి సర్పంచ్‌లు వినతి పత్రం అందజేశారు. శ్రీకాకుళం జిల్లా, రణస్థలం, లావేరు మండలాల వైసీపి, బీజేపి, టీడీపి సర్పంచులు తమకు రావలసిన ఒక సంవత్సరం ఆరుమాసాల స్టాంప్ డ్యూటీలు సీనరీస్ డబ్బులను సర్పంచ్ ల ఖాతాల్లోకి జమ చేయాలని రణస్థలం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ వారికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగానే మిగిలిపోయారని రాష్ట్ర ప్రభుత్వం నిర్వాకం వలన తమకు దక్కవలసిన కనీస గౌరవం కూడా దక్కడం లేదని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీలకు రావలసిన 15వ ఫైనాన్స్ డబ్బులు కేంద్ర ప్రభుత్వం కలుగజేసుకొని పంచాయతీలలోకి జమ చేస్తూ కనీస మౌలిక సదుపాయాలు కల్పించడానికి కూడా పంచాయతీ నిధులలో డబ్బులు లేకపోవడంతో సర్పంచ్ లు ఇబ్బందులు పడుతున్నారని ఎక్కడ మూలాలు ఉంటే అక్కడ వెతుక్కుంటూ రణస్థలం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్టాంప్ డ్యూటీలు సీనరీస్ డబ్బులను తమ ఖాతాలకు జమ చేసి తమని ఆదుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లావేరు, రణస్థలం మండలాల సర్పంచులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాను నిరంతర అభ్యాసంగా మార్చుకోవాలి

కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం : యోగాతో మానసిక, శారీరక ఒత్తిడులను జయించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ పేర్కొన్నారు. మన దేశంలో యోగా ఒక సంప్రదాయంగా ఉందని, దీనికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు లభించడం ఆనందదాయకమన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా స్థాయి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆయుష్ శాఖ, యువజన వ్యవహారాలు మరియు క్రీడలు మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్రం, యువజన సర్వీసులు శాఖ, క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే యోగాభ్యాసాన్ని ఒక అలవాటుగా మార్చుకోవాలని, నిరంతర సాధన చెయ్యాలని, నేటి జీవన విధానంలో నిత్యం అధిక ఒత్తిడులను ఎదుర్కొంటున్నామని, తద్వారా అనారోగ్యానికి గురయ్యే ప్రమాదముందని తెలిపారు. ఇటువంటి తరుణంలో యోగా చక్కని పరిష్కారమని, యోగాతో మానసిక ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. యోగా వలన నూతనోత్తేజం లభిస్తుందని, దీనివలన మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు అవకాశం కలగడమే కాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చాన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ఆయుష్ శాఖ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, నెహ్రూ యువ కేంద్ర, యువజన సర్వీసుల శాఖ, పతాంజలి, వాకర్స్ క్లబ్, వెల్ నెస్ కేంద్రాలు, యోగా క్లబ్, జీల్ ఫౌండేషన్ తదితరులందరికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యోగా గురువు సందీప్, చిన్న బాబు, సుధా రాణి కార్యక్రమంలో పాల్గొన్న వారితో వివిధ యోగాశనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డి.ఆర్.ఓ మురళీ కృష్ణ, జిల్లా విద్యాశాఖధికారి తిరుమల చైతన్య, మెప్మా పి.డి కిరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారిని బి. మీనాక్షి, ఆయుష్ సీనియర్ వైద్యాధికారి డాక్టర్.పి. జగదీష్, ఉత్తరాజు,యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి.వి.ప్రసాదరావు, ఎప్పిఓ తారక్ రత్న, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ శ్రీధర్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, నెహ్రు యువ కేంద్ర జిల్లా సమన్వయకర్త ఉజ్వల్, ఆయుష్ శాఖ అధికారులు, యువత తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల మైదానంలో వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేసిన మొక్కలు నాటు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఆర్. వి. వి. ప్రసాద్, వాకర్స్ క్లబ్ నుండి జోగినాయుడు, ఇందిర ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

అరసవల్లి : నగరంలోని స్థానిక పిఎన్ కాలనీలో

గల న్యూ సెంట్రల్ స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని యువ టూరిజం క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రముఖ యోగ గురువు పి వైకుంఠరావు ఆధ్వర్యంలో విద్యార్థులు యువ టూరిజం క్లబ్ సభ్యులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా యోగా గురువు వైకుంఠ రావు మాట్లాడుతూ మానవమేధస్సుని, మానవ శరీరాన్ని ఎల్లప్పుడూ చైతన్యపరిచేది యోగా మాత్రమేనని, అందువల్ల ప్రతి ఒక్కరు ఈ యోగాపై అవగాహన పెంచుకోవాలని క్రమం తప్పకుండా యోగాను అభ్యసించాలని ఈ సందర్భంగా తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు యోగా నేర్చుకుంటే వారి మేధస్సు ఎల్లప్పుడూ చైతన్యవంతంగా ఉంటుందని జ్ఞాపకశక్తి పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు పి శ్రీకాంత్, పి శ్రీదేవి లు యోగా గురువు వైకుంఠరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిడి ఎం వెంకటరావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పథకాలు మావి... ఆశీర్వాదాలు మీవి

జెడ్పీ చైర్‌పర్సన్ విజయ



విశాలాంధ్ర - సోంపేట : ప్రస్తుతం ఇంటింటికి ప్రజాసంక్షేమం కోరుతూ అందిస్తున్న పథకాలు మా ప్రభుత్వానివేనని, ఇటువంటి సంక్షేమ పథకాలకు ప్రజల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, సోంపేట కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాసు,పైల దేవదాసురెడ్డి అన్నారు. సోంపేట పట్టణంలోని పలు వీధుల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. దీనిపై పలు పేద కుటుంబాలు ఆనందం వ్యక్తం చేశాయి. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న వైఎస్ జగనన్న ప్రభుత్వానికి మీ మద్ధతు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే జగన్ ముఖ్యమంత్రిగా మళ్లీ రావాలనిపేర్కొన్నారు. అబద్ధపు హామీలతో అధికారం కోసం వెంపర్లాడే నాయకులను మళ్లీ నమ్మి మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతమ్మ, రెడ్డిక కార్పోరేషన్ చైర్మన్ డి.లోకేశ్వరరెడ్డి, పంచాయతీ ఈఓ వరప్రసాదరావు, ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, వైసీపీ కార్యకర్తలు, పలువురు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

టీడీపీతోనే యాదవులకు న్యాయం

రాష్ట్ర యాదవ సాధికారిత అధ్యక్షుడు నాగేశ్వరరావు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : తెలుగుదేశం పార్టీతోనే యాదవులకు అభి వృద్ధి, న్యాయం జరుగుతుందని రాష్ట్ర యాదవ సాధికారిత అధ్యక్షుడు వై. నాగేశ్వరరావు అన్నారు. బుధవారం కోటబొమ్మళి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా యాదవ సాధికరిత కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వర రావు యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీతోనే యాదవల అభివృద్ధి సాధ్యమని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత యాదవుల పై దౌర్జ్యాలు జరిగా యన్నారు, యాదవలంతా తెలుగుదేశం పార్టీతోనే ఉండి, తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా కన్వీనర్ జగదీశ్వర రావు మాట్లాడుతూ యాదవులు అంతా తెలుగుదేశం అభ్యర్ధులను ఏడు నియోజకవర్గ ములలో గెలిపించుకొని చంద్రబాబు నాయుడుకి ముఖ్యమంత్రిని చెయ్యాల్సిన అవసరం ఉందని పేర్కున్నారు. లోడగల కామేశ్వరరావు మాట్లా డుతూ యాద వులను బిసిడి నుండి బిసిఏకి మారిస్తే తప్ప యాదవ పిల్లలకు ఉద్యోగాలు రావని, కావున మనమంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అంబటి కృష్ణమూర్తి, సప్ప నవీన్, వంజ రావు గంగులు, సబ్బి జానకిరామ్, మద్దు రావు, మద్దిలి జోగారావు, కొర్రయి మల్లేసు, కొర్రయి ధర్మారావు, పిట్ట దాలినాయుడు, నాగాళ్ల మురళి, దాసరి వాసు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు యాదవ సంఘ నాయకులు పార్టీ కార్యాలయం అవరణలో ఉన్న సర్గీయ నందమూరి తారకరామారావు, కింజరాపు ఎర్ర న్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాలులర్పించారు.

నిత్య జీవితంలో యోగ అంతర్భాగం కావాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

విశాలాంధ్ర-శ్రీకాకుళం: నిత్య జీవితంలో యోగ అంతర్భాగం కావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలననుసరించి బుధవారం జిల్లా కోర్టులో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా జిల్లా కోర్ట్ హాల్ ప్రాంగణంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకలలో యోగ గురువు దక్షిణామూర్తి న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బందితో వివిధ రకాల యోగాసనాలను వేయించారు. ఈ సదస్సులో ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతూ ముందుగా అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ, ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో యోగ అంతర్భాగం కావాలన్నారు. ఈ సదస్సులో జిల్లా అదనపు న్యాయమూర్తులు, కె.శ్రీదేవి, భాస్కరరావు ఫణి కుమార్ , సీనియర్ సివిల్ జడ్జి మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఇన్చార్జ్ కార్యదర్శి, ఎం. అనురాధ, జూనియర్ సివిల్ జడ్జి లు కె. రాణి, డి. భరణి, శారదాంబ శ్రీవిద్య , జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్ని సూర్యారావు, స్టేట్ బార్ అసోసియేషన్ మెంబర్, గేదెల. వాసుదేవరావు, జిల్లా కోర్టు పరిపాలన అధికారి రవికుమార్ ఇతర జిల్లా కోర్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హుల సమస్యలను గుర్తించిందుకే జగనన్న సురక్ష

విశాలాంధ్ర - హిరమండలం : మిగిపోయిన అర్హులు సమస్యలను గుర్తించిందుకే జగనన్న సురక్ష కార్యక్రమం అని వైస్సార్సీపీ మండలఅధ్యక్షులు మీసాల రామకృష్ణ, సచివాలయల మండలకన్వీనర్ అందవరం వెంకట్ సురేష్ లు అన్నారు. బుధవారం మండలంలోని కొండ రాగోలు, గులుమూరు సచివాలయల్లో జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ బి శైలజ, మండల ఎం ఎల్ ఓ సి హెచ్ రాజు లు ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమం ను ఉద్దేశించి మండల సచివాలయ కన్వీనర్ ఏవీ సురేష్, వైస్సార్సీపీ మండల అధ్యక్షులు మీసాల రామకృష్ణలు మాట్లాడుతూ గ్రామ వాలంటీర్లు, గృహ శారదులు కలిసి ఈనెల 24 వ తేది నుంచి గడప గడపకు వెళ్లి ఆ ఇంట్లో సంక్షేమ పథకాలు అందు తున్నాయా లేదా తెలుసుకొని అర్హత ఉండి రాకుంటే వెంటనే పరిష్కారం చేయాలని ఈ సందర్భంగా తెలియ జేశారు. జులై 1 వ తేది నుంచి మండలస్థాయి అధికారులు 2 టీమ్ లు గా ఏర్పడి సచివాలయలకు వస్తారని ప్రజలు సమస్యలు అక్కడ కక్కడే పరిష్కారం చేయడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టత్మ కంగా తీసుకున్నారని అన్నారు. వివిధ సర్టిఫికెట్ లు, ప్రభుత్వ పథకాలు కు సంబంధించి ప్రతి గడప కు ప్రజాప్రతినిధులు, సచివాలయం కన్వీనర్, గ్రామ వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది బృందాలు గా హాజరవు తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలతో విద్యా నైపుణ్యం పెంపొందుతోంది

విశాలాంధ్ర - మందస : విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించేందుకు, పోటీతత్వం అలవర్చేందుకు క్విజ్ పోటీలు దోహద పడతాయని ఎంఇవో ఎం.లక్ష్మణరావు అన్నారు. బుధవారం మండల ఎమ్మార్సీ ఆవరణలో కాశీబుగ్గ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అంశంపై పలు పాఠశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీవన్‌సింగ్ ఠాకూర్, పైల కీర్తనలు ప్రథమ స్థానం సాధించారు. మందస జెడ్‌పిటిసి ఉన్నత పాఠశాల సి.హెచ్.వెంకట అవినాస్, అగ్గున హాసిని ద్వితీయ స్థానం సాధించారు. జి.ఆర్.పురం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన దుంపల సొనియాప్రియ, గుంట ధనలక్ష్మీ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు 5వేలు, 4వేలు, 3వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కాశీబుగ్గ యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి.చిరంజీవులు, కె.రాజేంద్రప్రసాద్‌లు పాల్గొన్నారు.

పలాస : పలాస ఎంపిడివో కార్యాలయంలో బుధవారం కాశీబుగ్గ యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అంశంపై పలు పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బ్రాహ్మణతర్లా జెడ్‌పి హైస్కూల్ 9వ తరగతి విద్యార్థులు బి.హేమంత్, ఎస్.ప్రణీత్‌సాయిలు ద్వితీయ బహుమతి సాధించారు. విజేతలకు ఎంఇవోలు శ్రీనివాసరావు, సత్యం బహుమతులు అందజేశారు.

యోగాతో ఆరోగ్యం : యోగా శిక్షకులు శ్రీకాంత్ మహంతి

విశాలాంధ్ర - ఇచ్ఛాపురం : యోగా విద్య సనాతన భారతీయ సాంప్రదాయంలో ప్రత్యేకతను కల్గి ఉందని ప్రముఖ యోగా శిక్షకులు శ్రీకాంత్ మహంతి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో తన యోగా విన్యాసాలతో స్థానికులను అలరించారు. తాను యోగ సాధన చేయడంతో పాటు పలువురికి నేర్పి సంతృప్తిని పొందుతున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. యోగాభ్యాసం వల్ల శారీరక మానసిక ధృడత్వం కల్గుతుందని, ప్రశాంత చిత్తంలో కార్యకలాపాలు నిర్వహించుకునే వీలు ఉంటుందని, వివిధ రకాల రోగాలు కూడా నియంత్రణలో ఉంటాయని అన్నారు. దశాబ్ద కాలం పాటు యోగా విద్య ప్రదర్శనలో వివిధ స్థాయిల్లో తన ప్రతిభను చూపుతు ప్రశంశలు అందుకోవడమే గాక తన శిష్యులు కూడా వివిధ సందర్భాలో జాతీయ వేదికలపై ప్రదర్శనలిచ్చే స్థాయికి చేర్చిన శ్రీకాంత్ తన పేదరికాన్ని లెక్క చేయకుండా యోగా విద్య వ్యాప్తికి నిరంతరం కృషి చేస్తుండటం పట్ల ప్రముఖుల అభినందనలు అందుకుంటున్నారు. జాతీయ స్థాయిలో కనబర్చిన ప్రతిభతో సెప్టెంబర్ నెల 9 నుండి 14వ తేదీ వరకూ బ్యాంకాక్‌లో జరిగే అంతర్జాతీయ యోగా పోటీల్లో పాల్గొనేందుకు స్థానం పొందడం చెప్పుకోలేని సంతృప్తిని ఇచ్చినట్లు తెలిపారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పతాంజలి యోగా శిక్షకుడు సంజీవ్ ఆధ్వర్యంలో నిర్వహించగా మున్సిపల్ ఛైయిర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌చంద్రప్రసాద్, సర్వేయర్ తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు. పలు యోగా విన్యాసాల అనంతరం వారు మాట్లాడుతు ప్రతీ ఒక్కరు వృత్తి ఉద్యోగ వ్యాపకాలతో గడుపుతున్నా... ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కోరారు. అందుకు ప్రతి నిత్యం కొద్ది పాటి సమయం కేటాయిస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయిన అన్నారు.

జాజిమొగ్గల తరణి మృతి పార్టీ కి తీరని లోటు

విశాలాంధ్ర - శ్రీకాకుళం : సీపీఐ కంచిలి మండల కార్యదర్శి జాజిమొగ్గల తరణి మృతి పార్టీకి తీరని లోటు అని, ఆయన మృతి పట్ల సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గురుగుబెల్లి రాజేశ్వర రావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తరణి ఒక నిబద్ధత కలిగిన కమ్యూనిస్టుగా సీపీఐ కి పనిచేశారు అని, ఎందరో అభాగ్యుల పక్షాన పోరాడి పేదల సంక్షేమం నిరంతరం కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించి నపుడే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అవుతుందని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అపారిశుధ్యంగా గొల్లబంజీపేట

విశాలాంధ్ర - నందిగాం : గొల్ల బంజీరుపేట గ్రామంలో గల బడిబాట బురద మయం అస్తవ్యస్తంగా పారిశుధ్యం కాలువలు లేకపోవడం వల్ల రోడ్డు మీదకే మురుగునీరు వచ్చి నిలిచిపోవడంతో స్కూలుకు వెళ్లే పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గ్రామస్తులు రోడ్డుపై వెళ్ళినప్పుడు దుర్గంధభరితంగా మురికి పేరుకుపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారులు దీన్ని పరిష్కరించి మాకు డ్రైనేజీ సౌకర్యం కల్పిస్తారని కోరుతున్నారు. ఎక్కడకక్కడ మురికి పేరుకుపోవడంతో రానున్నది వర్షాకాలం కావున ప్రజలు రోగాలబారినపడే ప్రమాదం ఉన్నందున గ్రామంలో ఉన్న ప్రజలు తీవ్ర అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించండి అని అధికారులను విన్నవించు కుంటున్నారు.

రోగులకు ఉచిత వైద్యసేవలు

విశాలాంధ్ర - సోంపేట : సోంపేట పట్టణంలో గల పెద్దపల్లివీధి, చిన్నపల్లి వీధిలలో జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. చుట్టుప్రక్కల వీధులకు చెందిన అనేక మంది రోగులు హాజరై డాక్టర్‌ల ద్వారా తనిఖీలు చేయించుకున్నారు. వైద్యులచే ఆరోగ్య సూచనలు, సలహాలు పొందారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లా వెంకటరమణ, దొండపాటి శ్రీను, వీఆర్‌ఓ గోపి పాల్గొన్నారు.

లో వోల్టేజీతో రైతులకు తీవ్ర ఇక్కట్లు

విశాలాంధ్ర - సోంపేట : ప్రస్తుత వేసవిలో లోవోల్టేజీ సమస్యతో రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతు కులం కన్వీనర్ జన్నెల వరప్రసాదరావు పేర్కొన్నారు. ఈ మండలం కొర్లాం గ్రామంలో బుధవారం రైతులతో సమావేశమై వ్యవసాయ సమస్యలపై చర్చించారు. పలువురు రైతులు లోవోల్టేజీతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వరప్రసాదరావు మాట్లాడుతూ రైతుల పక్షపాతిగా చెప్పుకుంటున్న ప్రభుత్వం ఇటువంటి విద్యుత్ సమస్యలు పరిష్కరిచండం తక్షణ అవసరమని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల రైతు కులం అధ్యక్షుడు బెందాళం మదన్‌మోహన్, సలహాదారు రాంబుడ్డి గణపతి, దున్న సత్యం, మూల గోపాలకృష్ణ, వెదుళ్ల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధి గ్రస్తులను పరామర్శించిన వైస్ ఎంపీపీ లోతుగెడ్డ

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లందుకు నిర్ణయం

విశాలాంధ్ర - కొత్తూరు : మండలం దిమిలి గ్రామంలో పలువురు కిడ్నీ సంబంధిత వ్యాధులు తో బాధ పడుతున్నారు. కొత్తూరు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసి వర ప్రసాద్ రావు బుధవారం దిమిలి గ్రామంలో పర్యటించి న సమయంలో స్థానిక నాయుకులు ఈ కిడ్ని వ్యాధిగ్రస్తులు సమస్య ను వైస్ ఎంపీపీ లోతుగెడ్డ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో పలువురు కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్న విషయం తెలుసుకొని నేరుగా సదరు పేషేంట్లు తో లోతుగెడ్డ మాట్లాదారు. వ్యాధి నిర్ధారిస్తూ వారి దగ్గర ఉన్న మెడికల్ రిపోర్టలను చేసేరు. .గ్రామంలో ప్రస్తుతం 30 మంది వరకు కిడ్నీ సమస్యలుతో బాధపడుతున్నారు. కిడ్నీ సమస్యలు తో 4గురు వ్యక్తులు ఇప్పటికే మృతి చెందిన ట్లు తమ దృష్టికి గ్రామస్తులు తెచ్చినట్లు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు ఇక్కడ మీడియా కు విడుదల చేసిన ఒక ప్రకటన లో తెలిపారు జిల్లా కలెక్టర్ ,జిల్లా వైద్యాశాఖాధికారి కి నేరుగా కలిసి దిమిలి గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులుసమస్య ను తీసుకువెళ్తమని విశాలాంధ్ర ప్రతినిధి కి వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తెలిపారు.

జూన్ 30న సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాలు పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సంతకాలు సేకరణకు, జూన్ 30న సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్య దర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు నంబూరు షణ్ముఖరావు పిలుపునిచ్చారు. బుధవారం కోటబొమ్మాళి సిఐటీయు కార్యాలయంలో హనుమంతు ఈశ్వరరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఫిక్స్ చార్జీలు ,ట్రూ అప్ చార్జీలు ,కస్టమర్ చార్జిలు పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారం మోపుతుందని విమర్శించారు. 2014 నుండి 2019 వరకు అదనపు ట్రూ అఫ్ చార్జీ పేరుతో ఇప్పుడు వసూలు చేయడం ఎంతవరకు న్యాయము అని వారు ప్రశ్నించారు. దీనివలన గతంలో అద్దెకున్న వాళ్ళు వాడుకున్న కరెంటుకు ఇప్పుడు అద్దెకున్న వారు చెల్లించవలసి వస్తుందని వారు ఆరోపించారు. ఇది ప్రస్తుతం అద్దెకు న్న వారిపై అదనపు భారం పడుతుందని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు షరతులకు తలోగ్గి విద్యుత్ రంగాన్ని మూడు మొక్కలు చేసిందని ఆ విద్యుత్ సంస్కరణ నేడు వైసిపి ప్రభుత్వం మరి అంత ముందుకు తీసుకెళు ందని విమర్శించారు. సర్దుబాటు చార్జీలు వసూలు నిలిపివేయాలని, గృహ వినియోగదారులు అందరికీ 100 యూనిట్ల లోపు ఉచితంగా విద్యుత్ ఇవ్వాలని, విద్యుత్తు పంపిణీ సంస్థకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు .ఆదానితో సహా వివిధ కార్పొరేట్ సంస్థలతో చేసుకున్న అడ్డుగోలు విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ప్రజలనుండి సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాలు నాయకులు కొల్లి యల్లయ్య, గొండు నీలన్న, బోర శ్రీను, సనపల ఆనందరావు, జీరు గురువులు, కాంతారావు, సిహెచ్.వెంకట్రావు, పి.ఆనందరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

విశాలాంధ్ర - ఎల్ఎన్‌పేట : లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాల నందు బుధవారం అంతర్జాతీయ యోగ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సంద ర్భంగా యోగ ఆసనాలు వేసారు. ఈ సందర్భంగా యోగ, యొక్క విశిష్టతను గూర్చి వివరించారు. ఈ కార్యక్రమం నందు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, దివ్యాంగ ఉద్యోగసంఘ రాష్ట్ర నాయుకుడు, లయన్స్ క్లబ్ సర్వీస్ చైర్ పర్సన్ లయన్ డా॥ ఎం.కె.మిశ్రో,హెచ్‌ఎం జి.ఎం.పాత్రో, పంచాయితీ సెక్రటరీ జయ మోహన్, ఉమెన్ వెల్ఫేర్ సెక్రటరీ భాగ్యలక్ష్మి వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాలత్రిపుర సుందరి, డిజిటల్ అసిస్టెంట్ హరిక్రిష్ణ, ఉపాధ్యాయులు టి.ఉపేంద్ర, అంగన్వాడీ టీచర్లు నవభారతి, అరుద్ర, సంగీత, వాలంటీర్లు తిరుపతిరావు, మనోజ్,దుర్గారావు, గిరి, రజని, శ్రావణి, సూర్యకళ మరియు విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటింటికి వెళ్ళి సంక్షేమ పథకాలు ఆరా తీయండి

మండల జేసీఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషణరావు

విశాలాంధ్ర - కోటబొమ్మాళి : ఈనెల 24వ తేదీనుంచి వాలంటీర్లు, గృహ సారదులు ప్రతి ఇంటికి వెళ్ళి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా విషయంపై ఆరా తేసి ఎవరికైన అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అందే విధంగా చర్యలు తీసుకోవాలని మండల జేసిఎస్ కన్వీనర్ గడ్డవలస నాగభూషనరావు, ఎంఎల్ఓ తారక్, సచివాలయ కన్వీనర్ సంపత్‌రావు జనార్ధన్‌లు అన్నారు. బుధవారం లఖందిడ్డి సచివాలయంలో లఖందిడ్డి, గంగరాం, మూలపేట గ్రామ గృహసాదరులు, వాలంటీర్లుతో జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లు, గృహసారధులు కలిసి 24వ తేదీ నుండి ప్రతీ గడపకి వెళ్లి ఆ ఇంట్లో సంక్షేమ పథకాలు అందు తున్నాయా, ఇంట్లో చదువుకున్న పిల్లలు ఉంటే క్యాస్ట్ ఇన్‌కమ్, ఇతర సర్టిఫికెట్లు ఏవైనా కావాలనుకుంటే వాటిని మీరు తొందరగా పరిష్కరించి వాళ్ళింటికి తీసుకెళ్లి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంను ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి చాలా ప్రతిష్టా త్మకంగా తీసుకొని అమలు చేయమన్నారు. కావున మనమంతా ఈ కార్యక్రమన్ని విజయవంతం చేద్దామని వారు కోరారు. అలాగే ప్రతి ఇంటిలో ఏదైనా సమస్య ఉంటే ఒకటవ తేదీ నుండి మండల టీం మండల అధికారులు రెండు టీములుగా ఏర్పడి సచివాలయానికి వస్తారని, వచ్చి ఎవరివైన సమస్య ఉంటే సమస్యల్ని అక్కడకక్కడే పరిష్కరించడం జరుగుతుందని తెలియజేశారు.

ఘనంగా అంతర్జాతీయ యోగదినోత్సవము

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : అంతర్జాతీయ యోగా దినోత్సవము సందర్భంగా, దండుగోపాలపురం జిల్లా ప్రభుత్వ ఉన్నతపాఠశాల, గోవిందపురం పంచాయతీ లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధానో పాధ్యాయులు శ్రీకోత.చైతన్య, గోవింద పురం పంచాయతీ సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి లు మాట్లాడుతూ, యోగ వలన శారీరక ధృడత్వముతో పాటు మానసికప్రశాంతత చేకూరుతుందని, ప్రస్తుత తరుణములో ప్రతిఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, దీనిని అధిగమించుటకు యోగ ఒకగొప్ప మార్గమని అన్నారు. ఈ సందర్భంగా సూర్యనమస్కారాలు, పద్మాసనం, వృక్షాసనము, తాడాసనము, ఉత్తానపాదాశనం, పశ్చిమోత్తానసనము, ఉష్ట్రాసనము, వజ్రాసనం, చక్రాసనం వేయించారు. ఆయా కార్యమాల్లో. పంచాయతీ కార్యదర్శి సనపల ఢిల్లీశ్వరరావు, వైకాపా యువనాయులు రెయ్యి ప్రసాదరెడ్డి, ఉపాధ్యా యులు తూట భాస్కరరావు, వీరభద్రరావు, లక్ష్మీకాంతం, ఆదికేశవరెడ్డి, లక్ష్మి, నాగేశ్వరరావు, పార్వతి, ఉమ, రాము, చిన్నారావు, మురళీధరరాజు, విజయలక్ష్మి, రవికుమార్, మార్కండేయులు, సీఆర్పీ గిరి, రోజా, దయాసాగర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలాస అసెంబ్లీలో మారుతున్న రాజకీయ పరిణామాలు

నువ్వా.. నేనా.. అంటూ వైసీపీ, టీడీపీ పార్టీలు

విశాలాంధ్ర - పలాస : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు మరో 8 నెలలు కాలం ఉండడంతో పలాస నియోజకవర్గంలో రాజకీయ ఎత్తుగడలు ప్రారంభమై వేడెక్కుతున్నాయి. నియోజకవర్గంలో మునుపెన్నడు లేని విధంగా కుల, సామాజిక సమీకరణల పేరిట సమరం మొదలైంది. అధికార పార్టీలో వైసీపీ ఆవిర్భావం నుంచి ఉన్న పూర్వపు సీనియర్ కేడరులో దాదాపు అధిక శాతం వరకు పార్టీకి దూరమైనట్లు ప్రచారం జరుగుతోంది. దీనిని పార్టీ అధిష్టాన వర్గం గుర్తించకపోవడంతో ఆ కేడరు రాబోయే ఎన్నికల్లో చురుగ్గా పాల్గొనే అవ కాశాలు కనిపించడం లేదన్న వాదన పార్టీ శ్రేణుల్లో వినిపిస్తోంది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్న జనాకర్షణ పథకాలు, సంక్షేమ పథకాలతో పాటు వైఎస్ జగన్ చరిస్మా తో పలాస నియోజకవర్గంలో రాష్ట్ర మత్స్య మరియు పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తన చతురత, ప్రణాళిక, మేధాశక్తితో రాజకీయంగా దూసుకుపోతున్నారు. ఈయన రాజకీయ దూకుడుకు ప్రధాన ప్రతిపక్షమైన టీడీపీ తట్టుకోలేని పరిస్థితి నెలకొందని తెలుస్తోంది. నియోజకవర్గం నాయకురాలు గౌతు శిరీషా నాయకత్వం అధికార పార్టీని వ్యతిరేకించడంలో వైఫల్యం చెందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే రాష్ట్ర స్థాయిలో టీడీపీ, బిజెపి, జనసేన పార్టీలు కలిసి ఏక తాటిపై నిలిచే అవకాశాలు ఉండడంతో ఆయా పార్టీలు నియోజకవర్గంలో సమన్వయంగా ఉంటే వైసీపీకి గట్టి పోటీ ఇచ్చే అవకాశాలు ఉన్నాయని పరిశీలకులు భావిస్తున్నారు. ఇకపోతే నియోజకవర్గంలో అగ్నికుల క్షత్రియు, కింతలి కాళింగులు, కాపులు, మైనార్టీ సామాజిక వర్గాలకు చెందిన వారికి అధికార వైసీపీలో గుర్తింపు లేదన్న అసంతృప్తితో పలువురు ప్రముఖులు ఉన్నారు. అగ్నికుల క్షత్రియుల సంఘం నాయకులు జుత్తు నీలకంఠం, కాళింగ కుల సంక్షేమ సంఘం నాయకులు దువ్వాడ శ్రీకాంత్, దువ్వాడ హేంబాబు చౌదరి, కాపు కుల సంఘం నాయకులు వడిశ హరిప్రసాద్, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుల నాయకత్వాన్ని బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నారని, మంత్రి డాక్టర్ సీదిరిని వ్యతిరేకించే అసమ్మతి నేతలు ఇటీవల సి.ఎం వై.ఎస్.జగన్‌కు ఫిర్యాదు చేశారన్న ప్రచారం జరుగుతోంది. పై సామాజిక వర్గాలు కూడా వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీల టిక్కెట్లు ఆశిస్తున్నారు. ఆయా సామాజిక వర్గాలకు చెందిన ఓటర్లు నియోజకవర్గంలో అధిక శాతం ఉన్నారు. ఈ వర్గాలకు రాజకీయ పార్టీలు టిక్కెట్లు ఇచ్చి గుర్తించకపోతే వారి ఓట్లు శాతం ఏ రాజకీయ పార్టీలకు పట్టం కడతారనే ప్రశ్న పలువురిలో ఉదయిస్తుంది. ఈ సామాజిక వర్గాల్లోని అధిక శాతం ఓట్లు ఏ పార్టీకి దన్నుగా నిలుస్తారోనన్న ఉత్కంఠ నెలకొంది. ఈ సామాజిక వర్గాల ఓటర్లే పార్టీ అభ్యర్థుల గెలుపు ఓటములకు కీలక పాత్ర పోషించే అవకాశాలు ఉండడంతో నియోజకవర్గంలో ఊహించని విధంగా ఎన్నికల నాటికి రాజకీయ పరిణామాలు ఉంటాయని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల్లో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే 50 కోట్ల రూపాయలతో నిర్మించిన కిడ్నీ పరిశోధక కేంద్రంతో పాటు 200 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తి కావచ్చి త్వరలో ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది. అలాగే పలాస రైల్వే గేటు వద్ద పై ఓవరు వంతెన పనులు కూడా నిరంతరం జరగడంతో ఎన్నికల ముందు పూర్తి చేసి ప్రారంభించేందుకు మంత్రి వడివడిగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నాటికి ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి అయితే నియోజకవర్గ ప్రజల దృష్టి మంత్రిపై పడుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మంత్రి పేరు చెప్పి కొంతమంది అనేక ప్రజావ్యతిరేక కార్య కలాపాలకు పాల్పడి కోట్లాది రూపాయలకు పడగలెత్తారని, వారిని అడ్డుకట్ట వేసేందుకు మంత్రి డాక్టర్ సీదిరి చేతులెత్తేశారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మంత్రి ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసినా భజన చేసే వారిని కనీసం ఎన్నికల వరకైనా దూరంగా పెట్టకపోతే నియోజకవర్గంలో పార్టీ మనుగడ సాగించడం కష్టమవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఆయన శ్రేయస్సు కోరి ఎవరైనా ఒక విషయం తెలియజేసేందుకు వస్తే ఒకే.. ఒకే .. అనడం తప్పా వారు చెప్పే విషయాలను గ్రహిస్తే భవిష్యత్ ఆయనదే అవుతుందని లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందని పలువురు సూచిస్తున్నారు. మరి ఆ దిశగా మంత్రి అడుగులు వేస్తారో లేదో వేచి చూద్దాం..!

జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పాతపట్నం : పాతపట్నం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం, ఛంగుడి సచివాలయంలో బుధవారం సచివాలయ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు విఆర్వోలులకు ఎంపీడీవో ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జయంత్ ప్రసద్ మాట్లాడుతూ జులై 1 నుంచి 28వ తేదీ వరకు ప్రతి సచివాలయంలో షెడ్యూల్ ప్రకారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మరియు వాలంటీర్లకు శిక్షణ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ జగనన్న సురక్షా కార్యక్రమంలో కుల ధృవీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన,మరణ ధ్రువీకరణ, వివాహ ధ్రువీకరణ,కుటుంబ సభ్యుల ధ్రువీకరణ, పత్రాలు ముటేషన్ల వాదేవీలు, ఆధార్‌తో ఫోన్ నెంబర్ అనుసంధానం, పంట సాగుకు హక్కు కార్డు తదితర ఈ 9 అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయంత్ ప్రసాద్, ఈఓఆర్డి నరసింహ ప్రసాద్ పండా, పంచాయితీ డిడిఓస్ మరియు మండల జేఏస్సీ కన్వీనర్ ఏనుగుత సూర్యం మండల ఎం.ఎల్.ఓ నవీన్ సచివాలయ కన్వీనర్లు కోరాడ విమల, ద్వారపూడి నాగేశ్వరరావు, డి.పురుషోత్తం, చంగుడి సర్పంచ్ కోరాడ కాంతారావు, గృహసారథులు, వాలంటీర్స్‌తో అవగాహన సదస్సును నిర్వహించారు.

నిరుపేద విద్యార్థినికి చేయూత

విశాలాంధ్ర-కవిటి: మండలంలోని చిన్నఎర్ర గోవిందపుట్టుగ గ్రామంలోని ఎర్రవీధికి చెందిన ఎర్ర మీన అనే నిరుపేద విద్యార్థినికి శ్రీ చింతామణి అమ్మవారి ట్రస్ట్(హైదరాబాద్) తరపున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఒంగోలు లో కిమ్స్ కాలేజీలో నర్సింగ్ కోర్సో రెండవ సంవత్సరం చదువుతున్న ఎర్ర మీన అనే నిరుపేద విద్యార్థినికి శ్రీ చింతామణి అమ్మవారి ట్రస్ట్(హైదరాబాద్)కవిటి వారి ఆర్థిక సహాయం తో ఫీజులు నిమిత్తం 20 వేలు రూపాయలు శ్రీ చింతామణి అమ్మవారి ఆలయ కమిటీ సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు,ఉషోదయ యువజన సంఘం అధ్యక్షులు,మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్,ఆరంగి మధు,బి. వెంకటేశ్వరరావు,పోల్లాయి ఉమామహేశ్వర రావు,జన్ని లోకనాథం,ఆరంగి రాజు,బిజె శ్రీనివాస్,,బి హరి,కే జ్ఞానానందం,పిన్నింటి జయరాం,పందిరి దశరథ,ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,విద్యార్థిని పాల్గొన్నారు.

పలాస రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తక్షణమే ప్రారంభించాలి

- డిఆర్‌యమ్‌కు లేఖ, ఫోన్ ద్వారా సంభాషణ
- తాళభద్ర రైల్వేగేట్ స్థానంలో ఆర్‌యూబి నిర్మించాలని కోరిన ఎంపీ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : పలాస రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జి తక్షణమే ప్రారంభించాలని డివిజన్ రైల్వే మేనేజర (డిఆర్‌యమ్)ని కోరినట్లు శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్నాయుడు తెలిపారు. ఈ బ్రిడ్జి ప్రారంభించకపోవడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని అన్నారు. ప్రజల సౌకర్యార్థం ఈ బ్రిడ్జిని ప్రారంభించాలని ఇప్పటికే పలుమార్లు డి ఆర్ యమ్ కి లేఖ రాసానని గుర్తు చేశారు. ఇటీవలే డి ఆర్ యమ్ తో ఫోన్ లో సంభాషించానని త్వరితగతిన ఈ బ్రిడ్జిని ప్రారంభించాలని కోరితే రథ యాత్ర అయిన తరువాత ఇచ్ఛాపురం నుండి పలాస వరకు ఎంపీ తో కలిసి రైల్వే స్టేషన్లలో పర్యటించి ఉన్న సమస్యలను త్వరిత్తగతిన పూర్తి చేస్తాం అని డి ఆర్ యమ్ హామీ ఇచ్చారని తెలిపారు.అలాగే తాళ్లభద్ర రైల్వే గేట్ స్థానంలో ఆర్ యూ బి నిర్మించాలని విన్నవించినట్లు తెలిపారు.ప్రజా రవాణా సౌకర్యార్థం తక్షణమే ఈ రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిని ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డివిజన్ రైల్వే మేనేజర్ నీ కోరినట్లు రామ్మోహన్నాయుడు తెలిపారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలి : నోడల్ ఆఫీసర్ విద్యాధరరావు

విశాలాంధ్ర-మెళియాపుట్టి: విద్యార్థి దశ నుండే పోటీ తత్వాన్ని పెంపొందించుకొని పదిమందికి ఆదర్శంగా నిలవాలని నోడల్ ఆఫీసర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఎస్. విద్యాధరరావు అన్నారు. 8, 9, 10 తరగతి విద్యార్థులకు నిర్వహించిన (బ్యాంకింగ్ రంగంపై ఆర్థిక వ్యవస్థ అక్షరాస్యత పై అవగాహన) ఫైనాన్షియల్ లిటరసీ కార్యక్రమంలో భాగంగా బుధవారం మెళియాపుట్టి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. క్విజ్ కాంపిటీషన్లో విన్నర్స్ గా నిలిచిన జి.టి.డబ్ల్యు.ఏ.జి.హెచ్.ఎస్ పెద్దమడి విద్యార్థులకు రూ.5వేలు సెకండ్ ప్రైజ్ సాధించిన కోసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.4వేలు, మెళియాపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మూడో బహుమతిగా రూ.3వేలు విద్యార్థులు కైవసం చేసుకున్నారు. నగదుతో పాటు విద్యార్థులకు ప్రశంస పత్రాలు సైతం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ భవిష్యత్ కాలంలో ఉండే పోటీతత్వాన్ని ఇక్కడి నుంచే ప్రణాళికాయుతంగా ముందుకు సాగి పది మందికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. క్విజ్ కాంపిటీషన్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు అర్హత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి విద్యాధరరావుతో పాటు ఎంఈఓలు దేవేంద్రరావు, పద్మనాభరావు, తహసిల్దార్ సరోజినీ, ఎంపీడీవో చంద్రకుమారి, హెచ్ఎం గణపతిరావు, ఎన్.వి.ఎల్ నరసింహమూర్తి, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించండి

విశాలాంధ్ర-జలుమూరు : పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్త వహించాలని సచివాలయ ఏఎన్ఎం రంగమ్మ సూచించారు. జలుమూరు మండలం సైరిగాం గ్రామంలో ఉపాధి హామీ వేతనదారులకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. నీరు, గంజి మజ్జిగ, బార్లీ, కొబ్బరి నీరు వంటివి అధికంగా త్రాగాలని, వైద్య ఆరోగ్యశాఖ పంపిణీ చేస్తున్న ఓఆర్ఎస్ ద్రావణం వినియోగించాలని హితవు పలికారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్.ఎం.కు సత్కారం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సామల సింహాచలంను ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఆయన్ని మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఉపాధ్యాయులు ఎం.ఈ.ఓ కె. అప్పారావు ఆధ్వర్యంలో దుశ్శాలువతో సత్కరించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తైలవర్ణ చిత్రాన్ని బహూకరించి, సింహాచలం ఆధ్వర్యంలో పాఠశాల మరింత పురోభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షించారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి బి.రమేష్, బి. జానకిరావు, వి. సాగర్, ఎం. అప్పారావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర-పలాస : రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న జగనన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని పలాస ఆర్డిఓ సీతారాం మూర్తి అన్నారు.బుధవారం మండలం అల్లుకోల గ్రామంలో గడపగడపకు కార్యక్రమంలో మంజూరైన నిధుల్లో భాగంగా రూ. 3 లక్షలు వ్యయం తో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సర్వే, రిజిస్ట్రేషన్ లు సచివాలయంలో చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దువ్వాడ వామాక్షి, ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, ఎంపీడీవో ఎన్ రమేష్ నాయుడు, మండల పంచాయతీ విస్తరణ అధికారి మెట్ట వైకుంఠ రావు, డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి నారాయణ, మండల సచివాలయం కన్వీనర్ దువ్వాడ రవి కుమార్, మాజీ పిఏసిఎస్ అధ్యక్షులు చింతాడ మాధవరావు, పిఆర్ ఏఈ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును గెలిపించాలి : ఎంపీ

విశాలాంధ్ర-జలుమూరు : రాష్ట్ర ప్రజలు భవిష్యత్తు, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. జలుమూరు మండలం ఏనేటి కొత్తూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం భవిష్యత్ కు గ్యారెంటీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్తు కోసం రానున్న ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించుకోవాల్సిన బాధ్యత తమందరిపై ఉందన్నారు.

వస్తున్నాయ్ జగన్నాథుని రథచక్రాలు

విశాలాంధ్ర-టెక్కలి : స్థానిక పెద్ద బ్రాహ్మణ వీధిలో శ్రీశ్రీశ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యులు దువ్వాడ. శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై స్వామి వారి విగ్రహాన్ని రథం పైకి ఎక్కించి ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దువ్వాడ. శ్రీకాంత్, దువ్వాడ. శ్రీధర్ బాబా,స్థానిక ఆలయ కమిటీ చైర్మన్ సాబతో, దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.వి.సూర్యనారాయణ పలువురు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శరవేగంగా ఆర్టీసీ విశ్రాంతి భవనం ఆధునికీకరణ పనులు

విశాలాంధ్ర-పాతపట్నం: ఆర్టీసీ విశ్రాంతి భవనం ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వైకాపా నాయకుడు బి. నారాయణమూర్తి పేర్కొన్నారు. విశ్రాంతి భవనం పనులను బుధవారం పరిశీలించారు. విశ్రాంతి భవనం పనులు పూర్తయితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. జిల్లా ప్రజా రవాణా అధికారులు విజయకుమార్, ఆర్.వి.రావు, డిపో మేనేజర్ కె.ఆర్.ఎస్.శర్మ, డీఈఈ రవికుమార్ ప్రత్యేక చొరవతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు.

ఏపీ మోడల్ స్కూల్‌లో క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-సోంపేట : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సమీకృత మరియు అభివృద్ధి విభాగంలో అఖిలభారత స్కూల్ క్విజ్ కాంపిటేషన్ స్థానిక ఏపి మోడల్ స్కూల్‌లో మండలస్థాయిలో బుధవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పదో తరగతి విద్యార్థిని వెన్నెల, 9వ తరగతి విద్యార్థిని శోభారాణి ప్రథమ బహుమతి సాధించి 5వేల రూపాయలను నగదు బహుమతిగా అందుకున్నారు. విజేతలను ఎంఈఓలు జోరాడు, కృష్ణంరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఐసిడిఎస్ పిఓపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తా : సర్పంచ్

విశాలాంధ్ర-ఆమదాలవలస : స్త్రీ శిశు సంక్షేమ శాఖ పరిధిలోని ఐసిడిఎస్ పిఓ వ్యవహార శైలి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని కనుగులవలస సర్పంచ్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నూక రాజు తెలిపారు. బుధవారం మండల కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ అనాథ పిల్లల కోసం వివరాలు తెలుసుకునేందుకు ఐసిడిఎస్ పిఓ కు ప్రభుత్వ నిబంధనలపై ఫోన్ చేయగా అసభ్యకర వ్యాఖ్యలతో అవసరం ఉంటే ఆఫీసుకు రావాలని అని మీరు ఎవరైనా ఫోన్లో సమాధానం చెప్పాల్సిన అవసరం తనకి లేదని చెప్పడంతో సర్పంచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. సర్పంచ్ హోదాలో సమాచారం అడిగితే అవమానపరిచే విధంగా వ్యవహరించారని ఆయన అన్నారు. ఇటీవల కార్యకర్తలు, ఆయాల నియామకంలో అక్రమాలకు పాల్పడ్డారని విమర్శలు ఉన్న నేపథ్యంలోనే ఇలా వ్యవహరించి ఉంటారని వారు భావిస్తున్నారు. అనాథ పిల్లలను చేర్పించేందుకు వివరాలు తెలుసుకునేగా ఆమె సమాధానం చెప్పేందుకు నిరాకరించారని సర్పంచి వివరించారు. పూర్తి వివరాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

వ్యవసాయ శాఖ పనితీరు అధ్వాన్నం

- విత్తన పంపిణీ పై సభ్యుల ధ్వజం... - మండల సమావేశానికి అధికారం దుమ్మా

విశాలాంధ్ర-ఆమదాలవలస : రైతాంగానికి సకాలంలో అందించాల్సిన విత్తనాలు రైతులకు అందించకపోవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొర్లకోట ఎంపిటిసి భాస్కరరావు మాట్లాడుతూ ఏరువాక ప్రారంభమైనటికే విత్తనాల అందిస్తామని చెప్పి నేటికీ అందించకపోవడంపై ధ్వజమెత్తారు. బుధవారం ఎంపీపీ తమ్మినేని శారదమ్మ అధ్యక్షతన మండల సమావేశం మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశం వ్యవసాయ శాఖ తీరుపై సభ్యుల ఆగ్రహం వ్యక్తం చేశారు.11 రకాల విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నామని ఏవో మోహన్ రావు ఇచ్చిన సమాధానం పై సభ్యులు మాట్లాడుతూ రైతుకు అవసరం లేని రకాలను గ్రామాలకు కేటా యించా రని కనీసం భూసార పరీక్షలు చేయకుండా మీకూ, మిల్లర్లకు నచ్చిన విత్తనాలను అందించడం వెనక ఆంతర్యం ఏమిటి అని నూకరాజు, బొడ్డేపల్లి గౌరీపతిరావు ప్రశ్నించారు. ఈల్డింగ్ రాని రకాలను, మిల్లింగుకు సహకరించని రకాలను అందించడం లేదని వ్యవసాయ అధికారి తెలిపారు. సమావేశంలో జీకే వలస, బెలమాం సర్పంచులు గ్రామాల్లో అభివృద్ధి రావడంలేదని అందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు మంజూరు కావడం లేదని వాపోయారు. అధికార పార్టీకి చెందిన సర్పంచులు అయినప్పటికీ వాలంటీర్లు గ్రామంలో కార్యక్రమాలు చేపడు తున్నారని కనీసం పనులపై సర్పంచుకు నామ మాత్రం కూడా తెలియజేయడం లేదని సభ్యుల ఆవేదన చెందారు. విద్యుత్ స్తంభాలు ఏసేట పుడు కూడా చేయలేదని సర్పంచులు సమావేశానికి వివరించారు. దీనిపై విద్యుత్ శాఖ ఏఇ రవికుమార్ మాట్లాడారు. ఏ ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు అవసరం ఉంటాయో అధికారికంగా ఎస్టిమేషన్ ఈ వేసిన తరువాతే వాటిని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. అమృత్సరవర్ పేరున ఉపాధి హామీ పనులలో భాగంగా చెరువులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాల్సిన వాటి పేర్లు ఎందుకు వివ రించలేదని సభ్యులు నిలదీశారు. మండలానికి మంజూరైన వాటిని పనులు ప్రారంభించలేదని పూర్తి అనుమతులు వచ్చిన తర్వాత వెల్ల డిస్తామని ఏపీవో సమాధానం ఇచ్చారు. సర్వసాధారణంగా జరిగిన ఈ సమావేశంలో ఎప్పటిలాగే అధికారులు సమావేశానికి దుమ్మా కొట్టారు. వచ్చిన అధికారులు కూడా మొక్కు బడిగా సమాధానాలు చెప్పి వెళ్లిపోయారు. కొంతమంది సర్పంచులు ఎంపీటీసీలు ఇప్ప టివరకు సమావేశ మందిరంలో అడుగు కూడా పెట్టలేదు. అలాగే వారి ప్రతినిధులే రికార్డుల్లో సంతకాలు చేయడం విశేషం. ఈ సమావేశంలో సభ్యులు కొంతమంది అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి నైపుణ్య కోర్సుల్లో ప్రవేశాలు

విశాలాంధ్ర-పలాస : పలాస డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటిఐలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవీవై)లో స్వల్ప కాలిక కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఉందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.బి.సాయి శ్రీనివాస్, ఐటిఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ ప్రకటనలో తెలిపారు. పిట్టర్ పాబ్రీకేషన్, అసోసియేట్ ఎలక్ట్రీషియన్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి లేదా ఆపైన పాసైన విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న పురుషులు మాత్రమే అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ సర్టిఫికేట్లు, పాస్‌ఫోటో, ఆధార్ జిరాక్స్‌లతో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు హాబ్ కోఆర్డినేటర్ 6301046329 సంప్రదించాలని తెలిపారు.

28 మందికి ఉద్యోగ అవకాశాలు: డా.వి కణితీస్ ప్రభుత్వ ఐటిఐలో గతంలో 2 బృందాలల్లో 30 మంది శిక్షణ పొందారని, అందులో 28 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. గ్రీన్ టెక్ కంపెనీలో పని చేసేందుకు 21 మంది ఎంపికయ్యారని, వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యంతో పాటు నెలకు 13500 రూపాయలు జీతం అందజేస్తారని తెలిపారు. అలాగే మేధా కంపెనీలో ఇద్దరు ఎంపికయ్యారని, షిరిడిసాయి ఎలక్ట్రికల్ కంపెనీలో ఒకరు, మాక్ ఇంటర్‌నేషనల్ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీలో ఒకరు, ఆప్‌కాస్ట్‌లో ముగ్గురు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జవహర్ తెలిపారు. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్స్ కోర్సుల్లో 30 మంది విద్యార్థులు శిక్షణ పొందారని, వారిలో 26 మందికి ఉద్యోగ అవకాశాలు వచ్చాయని అన్నారు. గ్రీన్ టెక్ కంపెనీలో 24 మందికి, నవత ట్రాన్స్‌పోర్టుల ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు.

మత్స్యావతారంలో జగన్నాధుడు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : గుడించా మందిరానికి చేరుకున్న బలబద్ర సుబద్ర సమేతుడైన జగన్నాధ స్వామి బుధవారం మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కూర్మ అవతారంలో బలబద్రున్ని అలంకరించారు. ఆలయ అర్చకులు రామ్‌ప్రసాద్ సిద్దాంతి, ఎస్.ఎన్.గోపాలక్రిష్ణమాచార్యులు పర్యవేక్షణలో పద్మకుమారాచార్యులు, రామక్రిష్ణాచార్యుల ఆధ్వర్యంలో స్వామి వార్ల విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేసిన అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం నుండి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి ఆశీస్సులు అందుకున్నారు.

రెయ్యిబోడమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-నందిగాం : మండలం పెంటూరు గ్రామంలో రెయ్యిబోడమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవ వేడుకల్లో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాల్గొన్నారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలెం శ్రీనివాసరావు, నందిగామ ఎంపీటీసీ ప్రతినిధి అంబోడి విష్ణు, బాలక్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మానసిక శారీరక పటిష్టత యోగాతోనే సాధ్యం

విశాలాంధ్ర-రణస్థలం : అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా పచ్చిగుళ్ళ సాయిరాం మేమున్నాం సేవా సంఘం అధ్యక్షులు, జె.ఆర్.పురం ఎంపీటీసీ ప్రతినిధి, పచ్చిగుళ్ళ సాయి దేవయాని, జె.ఆర్.పురం ఎంపీటీసీ, "యోగా ట్రైనర్" కొన్ని యోగ ఆసనాలు చేశారు. మీ ఆరోగ్యం మీచేతుల్లోనే ఉంది. యోగా చేయండి ఆనందంగా ఆరోగ్యంగా ఉండండి. ప్రజలందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

విశాలాంధ్ర-కవిటి/కంచిలి :కంచిలి మండలం జలంత్రకోట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో పసుపురెడ్డి శ్యామలరావు అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కవిటి మండలంలోని రాజపురం ఏపీ మోడల్ స్కూల్లో శ్యామలరావు గెస్ట్ ఫ్యాకల్టీగా విధులు నిర్వ హిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీ సులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా సమస్యలు పరిష్కరించండి

విశాలాంధ్ర-పొందూరు : మండలపరిధిలో ఉన్న పాఠశాల విద్యా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ నేతల బృందం మండల నూతన విద్యాశాఖాధికారి (ఎంఈవో-2) పట్నాన రాజారావును కోరారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజారావును బుధవారం ఏపీటీఎఫ్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ మండలంలో అన్ని ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని సమస్యల పరిష్కారానికి తనవంతు శైలిలో కృషి చేస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఎంఈవో -2 ను కలిసిన వారిలో మం డల ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మొగదాల రమణరావు, డి. శ్రీనివాసరావు, రాష్ట్ర కౌన్సిలర్ కోరుకొండ విజయ్ కుమార్, రఘునాయుడు. డి.రవికుమార్, రంగారావు, రాజులతో కూడిన ఉపాధ్యాయ బృందాలు వున్నారు.

యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : మానసిక ప్రశాంతత లేక ఎన్నో రోగాలు మనుషులకు వస్తున్నాయి అని యోగా, ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుంది అని సీపీఓ వీఎస్ఎస్ఎల్ ప్రసన్న అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక సీ పీ ఓ కార్యాలయం లో బుధవారం హర్ ఘర్ ధ్యానం ను యోగా గురువు దేసూల సురేంద్ర తో యోగా ఆసనాలు సిబ్బందికి నేర్పారు. ఈ కార్యక్రమం లో ఎస్ ఒ లు మురళీ కృష్ణ, సురేంద్ర, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కవిటిలో : యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని వక్తలు కొనియాడారు. బుధవారం మండలంలోని కవిటి ఎస్ వి జే విద్యాసంస్థల డిగ్రీ 1, 2 జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే, కవిటి శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల, మండలంలోని కరాపాడు టోల్ ప్లాజా ఆవరణంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా యోగ చేశారు. యోగతో మానసిక ప్రశాంతత, మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని వక్తలు తెలిపారు. కరాపాడు టోల్ ప్లాజా ఆవరణలో ఎన్‌హెచ్ఎఐ సిబ్బంది, టోల్ సిబ్బంది యోగ మాస్టర్ సూర్య తేజ్ ఆధ్వర్యంలో అంతరాజాతీయ యోగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎఐ పిడి పీకే సింగ్, ప్రాజెక్ట్ మేనేజర్ సెంథిల్ కుమార్, వి.వి.కె.వి ప్రసాద్, ప్లాజా మేనేజర్ జి.వి.రమణ, ఎన్ హెచ్ ఎ ఐ ఆర్ ఇ శివశంకర్‌సాహు, ఎన్‌హెచ్ఎఐ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని కవిటి స్థానిక ఎస్వీజే విద్యాసంస్థలు, శ్రీ కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు యోగ ఆసనాలు ప్రాముఖ్యత వివరించారు. వృక్షసన్, తాడ్సన్, వజ్రసన్ వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి జె డిగ్రీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం భాస్కరరావు, పి సత్య నారాయణ, ఎన్ఎస్ఎస్ పిఓలు భాస్కర్ రావు, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు. కళ్యాణి ఇంగ్లీష్ మీడియం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రాము, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాతపట్నంలో : సెంటెన్స్ కాన్వెంట్ స్కూల్లో

యోగా దినోత్సవాన్ని ఘనంగ నిర్వహించారు. యోగా గురువు ఎక్స్ ఆర్మీ రమేశ్ మాట్లాడుతూ యోగా అనేది ప్రాచీన భారతదేశంలో ఉద్భవించిన శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక అభ్యాసం భారతీయ యోగాను చూసి ముక్కున వేలేసుకునే విదేశీయులు నేడు యోగా వల్ల కలిగే ప్రయోజనాలను, మనసుకు, శరీరానికి కలిగే ప్రయోజనాలను తెలుసుకుని ఆదరిస్తున్నారు. యోగా మన శక్తిని మరింత సమర్థవంతంగా ఎలా ఉపయోగించాలో నేర్పుతుందన్నారు. మనసును ఎలా ప్రశాంతంగా ఉంచుకోవాలో యోగా నేర్పుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్, పిటి మాస్టార్లు, పి.వసంత్, రాజశేఖర్, షణంఖరావు, రోజారాణి మరియు స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

హిరమండలంలో : యోగ జీవితంలో ఒక భాగం కావాలని, యోగతో మానసిక ఉల్లాసం అని, యోగ తో సంపూర్ణ ఆరోగ్యమని పిఎసిఎస్ అధ్యక్షులు అందవరం వెంకట్ సురేష్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా యోగ డే నిర్వహించారు,, హిర మండలం మోనింగి వారి చెరువు గట్టు పై రాజు గురూజీ ఆధ్వర్యంలో ఉపాధి వేతనదారుల తో కాసేపు యోగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు ఎవి సురేష్, ఏపివో ఏ శ్రీనివాస్ రావు, ఈ సి ఎం సంతోష్, టీ ఏ ఎం గోవింద్, ఎఫ్ ఏ జె శైలజ లు పాల్గొన్నారు. అలాగే హిరమండలం పోలీస్ స్టేషన్ కు ఎదురు గా గల ఈశ్వరియు బ్రహ్మ కుమారి స్ ప్రాంగణంలో ఓం శాంతి అక్కయ్యలు 500 మందితో యోగ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద కోరాడ లోని శ్రీ రామేశ్వరి డిగ్రీ కళాశాలలో కారస్పాండెంట్ రెడ్డి గోపాల్ రావు విద్యార్థులతో యోగ నిర్వహించారు. సన్ స్కూల్‌లో యోగ నిర్వహించారు. కేజీబీవీ విద్యార్థులతో, ఉపాధ్యాయునిలతో యోగ దినోత్సవం ఎస్ ఓ ఎస్ కృష్ణవేణి నిర్వహించారు. హిరమండలం అంగురు వీధి లోని శాంతిని కేతన్ విద్యాలయంలో ఘనంగా యోగ దినోత్సవం ను విద్యార్థులు, ఉపాధ్యాయులు తో కారస్పాండెంట్ పి ప్రసాద్ రావు మాస్టర్ నిర్వహించారు.

జలుమూరులో : అంతర్జాతీయ యోగ దినోత్సవం సదర్భంగా ఎంపిడిఓ, ఎంఈవో, ఈవోపీఆర్‌డీ, ఏవో, అగ్రి కల్చరల్ అధికారులు, వెలుగు ఏపీఎం, ఎంజీఎన్ఆర్‌జీఎస్ స్టాఫ్, కెజీబీవీ విద్యార్థులు యోగా చేపట్టినట్లు మండల ఎంపీడీవో తెలిపారు.

నందిగాంలో : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.శివప్రసాద్ ఆధ్వర్యం లో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి మండల అధికారులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలిలో : ప్రభుత్వ జూనియర్ కళాశాల,

సరుబుజ్జిలిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం జరిగింది. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో

యోగా శిక్షకులు జంతుశాస్త్ర అధ్యాపకులు రమేష్ సాహు విద్యార్థులకు యోగా ఆవశ్యకతను తెలిపారు. అనంతరం యోగా ఆసనాలు ప్రాక్టీస్ చేయించారు. శరీరాన్ని మనసుని ఏకం చేయడమే యోగవిద్య అని ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి దుగ్గివలస రాంప్రసాద్, అధ్యాపకులు ధనుంజయ రావు, చిన్నారావు, రామకృష్ణ, లైబ్రేరియన్ రామారావు, కృష్ణమూర్తి, వినోద్, రాజు, శ్రీనివాసరావు, విజయ, సంగీత పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ క్యాంపస్, శ్రీ శివాని, శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలోను

మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. యోగా ప్రాధాన్యతను చాటుతూ యోగాసనాలు వేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.